క్లుప్తంగా

ఆలయం నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



ముద్దటమాగి యాదవ సంఘం నాయకులకు విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

చిప్పగిరి: హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణుడి ఆలయానికి ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ జోన్ వింగ్ ఇన్‌చార్జ్, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి రూ.50 వేలు విరాళం అందించారు. మంగళవారం చిప్పగిరిలోని ఆయన స్వగృహంలో ముద్దటమాగి గ్రామ యాదవ సంఘం నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు గొల్ల వెంకటేశ్వర్లు విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరు: స్థానిక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ డీఈ లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రి కార్డియాలజిస్టులు, జనరల్ మెడిసిన్ వైద్యులచే వైద్యచికిత్సలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ఇరిగేషన్ సిబ్బంది, టౌన్, రూరల్ పోలీసు సర్కిళ్లల్లో పనిచేసే పోలీసులకు ప్రత్యేక పరీక్షలు చేస్తారని తెలిపారు.

డెంగీపై అప్రమత్తం

మద్దికెర: డెంగీ వ్యాధి పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకొని మంగళవారం మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో సిబ్బందికి డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో వైద్య సిబ్బందితో పాటు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి డీడీటీ మందులు పిచికారీ చేయించడమే గాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఖాళీ టైర్లు, కుండీలు, తొట్టెలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో మెలకువలపై శిక్షణ

ఆలూరు: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ సూచించారు. స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో మంగళవారం రైతులకు వ్యవసాయ మెలకువలపై శిక్షణ ఇచ్చారు. నవధాన్యాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆస్పరి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రఘురామిరెడ్డి సూచించారు. మంగళవారం ఆస్పరిలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి: రామళ్లకోట గ్రామంలో నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి వైద్యులు తేజస్ సివాంగ్, దివాకర్, హుస్సేన్, ప్రదీప్ మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు గ్రామస్తులు ఉచిత వైద్య సేవలు, మందులు పొందారు.

రహదారి భూముల పరిశీలన

హొళగుంద: ఆదోని, ధనాపురం, హొళగుంద ప్రధాన రహదారి నిర్మాణ పనులకు సంబంధించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రహదారి నిర్మాణ పనుల కోసం ల్యాండ్ అక్విజేషన్ ద్వారా రైతుల నుంచి భూములు తీసుకునేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధగా రైతుల భూ సమస్యలను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆర్ఐ దినోజ్ రాజశేఖరన్, సర్వేయర్ శ్రీనివాసులు ఉన్నారు.

జీవాలను సంరక్షించాలి

ఎమ్మిగనూరురూరల్: జీవాలు వ్యాధుల భారిన పడకుండ యజమానులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మంగళవారం కడివెళ్ల గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయోజన పథకం కింద వాటర్‌షెడ్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గొర్రెలకు వ్యాక్సిన్ వేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మేకలు, గొర్రెలకు వచ్చే సీజనల్ వ్యాధులపై యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జబ్బు పడిన జీవాలను వైద్యశాలకు తీసుకొస్తే చికిత్స చేసి వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. వీఎల్ఓ వైకుంఠ వాసులు, వాటర్‌షెడ్ టీఏ శివ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గతంలో రోజుల తరబడి తిరిగాను



నాకు ఇద్దరు కుమారులు. వారికి పెళ్లిలు చేసి నేను పక్కన ఉంటున్న. నాలుగేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో చనిపోయాడు. మా గ్రామం నుంచి మండల కేంద్రం కృష్ణగిరికి వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేదు. ఉదయమే రహదారిలో కాచుకుని ఉంటే ఆటు వైపు వెళ్లే వాహనాలు, ఆటోల ద్వారా మధ్యాహ్నం కల్లా మండలానికి పోతే అక్కడ సమయానికి అధికారులు ఉండక మరో రోజు వెళ్లాల్సి వచ్చేది. ఏ చిన్నా పని చేయించుకోవాలన్నా రోజుల తరబడి తిరిగేదాన్ని. జగనన్న ప్రభుత్వంలో ఆ ప్రయాస తప్పింది. సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రోజులోనే సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తుండటంతో ఇలాంటి రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేసింది. – షేక్ సలీం బీ, పోతుగల్లు

రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సత్యవేణి. ఏనుగుబాల గ్రామ నివాసి, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం వలంటీర్ ద్వారా సచివాలయంలో సోమవారం దరఖాస్తు చేసుకుంది. యాప్‌లో నమోదు చేసుకున్న సర్టిఫికెట్లను పరిశీలించి ఒక్క రోజు వ్యవధిలోనే మంజూరు చేశారు. మంగళవారం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌లో సర్టిఫికెట్లను లబ్ధిదారురాలికి అందజేశారు. అధికారులను ఇళ్ల వద్దకే పంపి కావాల్సిన సర్టిఫికెట్లను ఇప్పించడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది.

పథకాలు వర్తించేలా ధ్రువీ'కరుణ'

- జగనన్న సురక్ష ద్వారా క్షణాల్లో ధ్రువపత్రాల జారీ
- ఉచిత సేవలపై లబ్ధిదారుల హర్షం



పందికోనలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎమ్మిగనూరులో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



పోతుగల్లులో సర్టిఫికెట్లు అందిస్తున్న పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్

పత్తికొండ రూరల్: అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే ప్రభుత్వ సంకల్పమని, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమయ్యే ధ్రువపత్రాలు క్షణాల వ్యవధిలో ఉచితంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పందికోన గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరై అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత ఉంటే చాలు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. తహసీల్దారు మనోజ్ కుమార్‌రెడ్డి, డీటీ విష్ణుప్రసాద్, ఎంపీడీఓ కవిత, డీఎల్‌పీఓ శ్రీకాంత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల, పోతుగల్లు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పాల్గొని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్‌తో కలిసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ రెండు గ్రామాల్లో 895 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందించినట్లు తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. సర్పంచ్ తెలుగు వాణీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని కామినహాల్, గూళ్యం గ్రామాల్లో మంగళవారం సర్పంచ్‌లు పద్మజ, ఉలిగమ్మ, తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోనీలు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ 4, 6వ వార్డు సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, వార్డు కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్‌తో కలిసి ప్రజలకు కావాల్సిన పలు సర్టిఫికెట్లను అందజేశారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, తహశీల్దార్ కె.ఆంజనేయులు జగనన్న సురక్ష క్యాంపును ఏర్పాటు చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు 307 మందికి, ఆదాయ ధృవీకరణ పత్రాలు 300 మందికి, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్–3, రైస్ కార్డులు–3 అందించడంతో పాటు ఆధార్ ఈకేవైసీ 50 మందికి పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని బురుజల గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం చేతులమీదుగా దాదాపు 200 మందికి ధ్రువపత్రాలు అందజేశారు.

గోనెగండ్ల: మండలంలోని బి.అగ్రహారం, అలువాల గ్రామాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీపీఓ నాగరాజు నాయుడు పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్ల, పగిడిరాయిలో ఎంపీడీఓ సావిత్రి, తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్ బండ్లపల్లి వెంకటేష్, గిడ్డయ్య పాల్గొని దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆలూరు: స్థానిక 3, 4వ సచివాలయంలో తహసీల్దార్ కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యాక్రమం నిర్వహించారు. జేసీఎల్ కన్వీనర్ ఈరన్న, ఎంపీడీఓ అల్లబకాష్, ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయకుడు, ఈఓ కృష్ణకుమార్ తదితరులు దరఖాస్తుదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామ సచివాలయం–1లో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో, హెచ్ బాపురంలో తహసీల్దార్ నిత్యానందరాజు నేతృత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ మునెమ్మ, ఎంపీటీసీ హనుమంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: బింగిదొడ్డిలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్, డీటీ ప్రసాదరాజు, ఈఓఆర్డీ నరసింహులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి 266 మందికి ఇన్‌కం, 272 మందికి క్యాస్ట్ సర్టిఫికెట్లు ఉచితంగా అందించారు. రేషన్ కార్డులో యాడింగ్, మ్యుటేషన్ తదితరాల 10 అప్లికేషన్లను ఉచితంగా రిజిస్టర్ చేసి టోకెన్ అందించారు. ఆధార్‌తో ఫోన్‌నంబర్ల లింక్‌ను పదుల సంఖ్యలో చేయించారు.

ఆస్పరి: ఆస్పరిలో తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మూలింటి రాధమ్మ, ములుగుందం–1లో సర్పంచ్ శ్యామలమ్మ అధ్యక్షతన సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. రెండు గ్రామాలలో 464 సర్టిఫికెట్లు అందజేశారు.

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాలైన 387 సర్టిఫికెట్లను ఎంపీడీఓ గౌరీదేవి పంపిణీ చేశారు. డీటీ సుదర్శన, సర్పంచ్ గొల్ల ఈరమ్మ ఉన్నారు.

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామంలో ఎంపీడీఓ సీవీ కొండయ్య ఆధ్వర్యంలో 175 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు.

సులువుగా సర్టిఫికెట్లు జారీ



నా కుమారుడు జయచంద్ర ఆచారి ఎంసెట్‌లో క్వాలిఫై అయ్యాడు. త్వరలో కౌన్సిలింగ్‌కు పోవాలంటే కుల, ఆదాయ సర్టిఫికెట్లతో పాటు ఓబీసీ అవసరం. ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలంటే నెల రోజులు అవుతుందన్నారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందే ఇంటి వద్దకు వచ్చి అన్ని వివరాలు నమోదు చేసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వెంటనే సర్టిఫికెట్ ఇవ్వడంతో చాలా సంతోషంగా ఉంది.
– మోహన్ ఆచారి, చిట్యాల

ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం



ప్రతి ప్రభుత్వ పథకానికి ఆధార్‌కార్డు తప్పనిసరి. ఆధార్‌కార్డుకు కచ్చితంగా మొబైల్ నంబరు లింకు ఉండాలంటున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నా ఆధార్ కార్డుకు మొబైల్ నంబరు లింక్ చేయించుకున్నాను. సచివాలయంలో సులభంగా పని పూర్తయ్యింది.
– శేఖర్, పందికోన, పత్తికొండ మండలం

నేనే తెచ్చుకున్నా..



మాది బురుజుల గ్రామం. పదో తరగతి పూర్తి చేశారు. ఇంటర్‌లో చేరేందుకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోగా వెంటనే సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఇంతత్వరగా పనిపూర్తవుతుందని అనుకోలేదు.
– కావ్య, బురుజుల, మద్దికెర మండలం

పైసా ఖర్చు లేకుండా ఇచ్చారు



మా నాన్న మంగళి శ్రీరాములు ఏడాది క్రితం అనారోగ్యంతో మరణించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీరుకు మా నాన్న మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ కావాలని చెప్పాను. పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్ అందజేశారు. – మంగళి రంగన్న, బి.అగ్రహారం

రోడ్డు నిర్మాణం పరిశీలన



ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డ్ పక్కన గల రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో రూ.50 లక్షతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు మార్కెట్ యార్డ్ పక్కన గల రోడ్డును మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సుధాకర్‌రెడ్డి, ఇంజనీరింగ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సర్దుకుపోతే జీవితం ప్రశాంతం



యాదరాళ్లలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

వెల్దుర్తి: చిన్న చిన్న సమస్యలపై గొడవ పడడం కంటే సర్దుకుపోవడం ఉత్తమమని, ప్రశాంత జీవితానికి మార్గమిదేనని సీఐ యుగంధర్ అన్నారు. ఆయన మంగళవారం ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి యాదరాళ్లను సందర్శించారు. గ్రామంలో ఇటీవల ఇంటి ముందు బైక్‌ల పార్కింగ్ విషయం, రాకపోకల విషయంపై గొడవలు పడుతూ పోలీసులు చర్యలు తీసుకునే స్థాయికి వెళ్లడంపై ఆయన గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువర్గాలకు రాజీ కుదిర్చి, సర్దుకుపోతామన్న హామీ తీసుకున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించడం, చైన్‌స్నాచింగ్‌పై అప్రమత్తం, 100 నంబర్, దిశ యాప్ ఉపయోగాలు, నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తలను వివరించారు.

అడ్మిషన్లు ఫుల్

ఆలూరు: స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన గురుకుల (బాలికల) పాఠశాలలో సీట్లన్నీ భర్తీ కావడంతో అడ్మిషన్లు ఫుల్ అనే బోర్డు పెట్టారు. ఆలూరులోని హత్తిబెళగళ్ రోడ్డులో ఉన్న గిరిజన గురుకుల (బాలికలు) పాఠశాలలో 250 సీట్లు, అదే క్యాంపస్‌లోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో 220 సీట్లకు నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు విద్యార్థులను చేర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలకు ఆకర్షితులై తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు పోటెత్తడంతో అడ్మిషన్లు ఫుల్ అయినట్లు హెచ్ఎం జమ్మన్న తెలిపారు.

వర్షం కోసం పూజలు

దేవనకొండ: నైరుతి రుతుపవనాలు విస్తరించినా వర్షాల జాడ లేకపోవడం, వేసవిలో నాటిన విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలిచిన పైర్లు ఎండిపోయి దేవనకొండ మండలంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షం కోసం రైతులు మొక్కని దేవుళ్లు లేరు. చేయని పూజలు లేవు. ఇందులో భాగంగా దేవనకొండలో వర్షం కోసం మహిళలు మంగళవారం పోతురాజు దేవుడికి బాణంతో నైవేద్యం సమర్పించారు. దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిపించాలని వేడుకున్నారు.

ఐసీయూలో పింఛన్ పంపిణీ



గుండె ఆపరేషన్ చేయించుకుని ఐసీయూలో ఉన్న రామళ్లకోట దస్తగిరమ్మకు పింఛన్ అందిస్తున్న జ్యోతి

వెల్దుర్తి: జగనన్న పింఛన్ కానుక పంపిణీలో భాగంగా లబ్ధిదారులు ఎక్కడ ఎలాంటి పరిస్థితిలో ఉన్నా వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్ అందిస్తూ వారికి కొండంత బలం చేకూరుస్తున్నారు. ఇదే కోవలో వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన దస్తగిరమ్మ గత నెల 30న గుండెకు సంబంధించిన వ్యాధితో నంద్యాలలో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఈ నెల 3న ఆమెకు గుండె ఆపరేషన్ చేశారు. అనంతరం ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న రామళ్లకోటకు చెందిన వలంటీర్ జ్యోతి నంద్యాల ఆసుపత్రికి చేరుకుని ఐసీయూలో ఉన్న దస్తగిరమ్మ బయోమెట్రిక్ నమోదుచేసుకుని కుటుంబ సభ్యులకు రూ.2,750 వితంతు పింఛన్ అందజేసింది. ఆసుపత్రిలో ఉన్న తమ వద్దకే ప్రభుత్వం పింఛన్ సొమ్ము పంపడం కొండంత భరోసా ఇచ్చిందని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



హెచ్. కైరవాడిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

గోనెగండ్ల: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో కాలువలో పూడికతీత పనులను మంగళవారం డ్వామా పీడీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేసుకుంటే రోజుకు రూ.272 కూలీ పడుతుందని తెలిపారు. రోజు వారి కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వేముగోడు గ్రామంలో హార్టికల్చర్ కింద రైతు లక్ష్మన్న పొలంలో జామతోట సాగుకు గుంతలను తవ్వించారు. సన్నకారు రైతులు పండ్ల తోటల సాగు చేపడితే ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఏపీఓ మహమ్మద్ బాష, ఈసీ ఉస్మాన్ బాష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి



పగిడిరాయిలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పగిడిరాయి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి .జగన్నాథరెడ్డి, కంగాటి రామ్మోహన్‌రెడ్డి, బసిరెడ్డి, ఎంపీపీ ఆదెమ్మ, సర్పంచ్ సౌజన్య, పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఎవరికెంత లబ్ధి చేకూరిందో వివరించి బుక్‌లెట్ అందజేశారు. ప్రజల ను ఆప్యాయంగా పలకరించి స్థానిక సమస్యలను అడి గి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్టీలకతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, నాగప్ప, రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జిట్టా నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి నివాళి

పత్తికొండటౌన్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని సదా స్మరించుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పందికోన గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పోరాటాన్ని కొనియాడారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకొంటే ఉపాధి అవకాశాలు పొందవచ్చని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి మరో విడత శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

ఆలూరు: న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఆలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తంరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా ఇండియన్ అసోషియేషన్ లాయర్స్ (ఐఏఎల్) కార్యవర్గ సభ్యుడు సురేంద్ర కుమార్ మాట్లాడారు. ఆదోని త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాది శ్రీనివాసకళ్యాణ్ రెడ్డిపై ఎస్ఐ పీరయ్య చెయ్యి చేసుకుని కేసు నమోదు చేయడాన్ని న్యాయవాదులు ఖండించారు. న్యాయవాదులు లక్ష్మికాంతం, ప్రవీణ్‌కుమార్, షేక్‌షావలి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య, సీనియర్ న్యాయవాదులు హెచ్‌కే లక్ష్మన్న, పి.ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఐఏఎల్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఎదురుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ న్యాయవాదులు నిరసన తెలిపారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

మద్దికెర: మండల పరిధిలోని కొత్తపలి గ్రామ శివార్లలో ఉన్న పోలేరమ్మ దేవాలయంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు హుండీని అపహరించి నగదు చోరీ చేశారు. ఖాళీ హుండీని పొలాల్లో పడేశారు. ఆలయం గ్రామ శివారులో ఉండడం, జనసంచారం తక్కువగా కావడంతో తెలిసిన వ్యక్తులే దొంగతనం చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రైతు ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి చెందిన నగరూరు రామాంజనేయులు (42) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంటలు కలిసి రాక అప్పులు కావడంతో వాటిని తీర్చే మార్గం తెలియక మనస్తాపంతో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రమాదేవి, ఒక కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

హొళగుంద: మండల పరిధిలోని బొమ్మగుండనహళ్లి గ్రామానికి చెందిన చాకలి బసవరాజు (36) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. బసవరాజు చాలాకాలంగా తాగుడుకు బానిసై డబ్బుల కోసం ఇంట్లో గొడవ పడేవాడు. ఇటీవల తాగుడు మరింత పెరగడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య వరలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వృద్ధుడి ఆత్మహత్య

మద్దికెర: మండల కేంద్రంలో మల్లయ్య (70) అనే వ్యక్తి ఆరోగ్యం బాగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది క్రిమీ సంహారక మందు సేవించి మంగళవారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం గుంతకల్లు వైద్యశాలకు, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మల్లయ్య బీపీ, షుగర్, కడుపునొప్పితో బాధపడుతున్నాడని, ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా బాగుకాకపోవడంతో మనస్తాపం చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో మంగళవారం లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఇంటి వద్ద కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తుండగా పట్టుకుని 108 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. నిందితుడిపై కేసు మోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ఆలూరు రూరల్: ఆలూరు సమీపంలోని బెళగుండ ఆంజనేయ స్వామి ఆర్చ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి.. కర్ణాటక రాష్ట్రం మాన్వి గ్రామానికి చెందిన జనార్ధన్, ప్రసన్న, నాగరాజు అక్రమంగా 1,344 కర్ణాటక మద్యం (90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు) తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. టాటా ఇండిగో కారు నంబర్ ఏపీ 16 సీఎఫ్ 6858ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను ఆదోని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ, తొగర్చేడు గ్రామ శివారుల్లో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని, నాటుసారాను కలిగివున్న ఆలంకొండ వీరాంజనేయులు, కల్లూరు మండలం కొల్లంపల్లి తాండకు చెందిన జటావత్ బాలునాయక్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి 55 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, 5 లీటర్లను సారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మద్యం విక్రేత అరెస్ట్

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. నందవరం మండలంలోని మాచాపురం గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర తన ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి జాన్స్ ఒరిజినల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ 38 ట్రెటా ప్యాకెట్లను (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

వెల్దుర్తి: మండల కేంద్రంతోపాటు, బాలాపురంలో తాము, కోడుమూరు సెబ్ అధికారులు మంగళవారం జరిపిన సోదాలలో బేరిపోగు రాజమ్మ, చిన్న మునిస్వామి వద్ద నుంచి 18 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇద్దరు నిందితులను డోన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు.